Eenadu 01-03/06/15

# మంత్రముగ్ధం.. శకట సందేశం

- ఆకట్టుకొన్న కళాకారుల నృత్యాలు
- అలరించిన పోలీసుల కవాతు
- సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుక సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తెలంగాణ ప్రభుత్వ అధికార చిహ్నం, పోలీసు లోగో రూపకర్త ఏలే లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర తొలి అవతరణ వేడుకలు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మంగళవారం ఘనంగా జరిగాయి. వివిధ శాఖల శకటాలు, సాంస్కృతిక శాఖ కళాకారుల నృత్యాలు కన్నుల పండువగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. అశ్విక దళం కవాతు మంత్రముగ్ధుల్ని చేసింది. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ రూపొందించిన శకటాలు ఆకట్టుకొన్నాయి. మెట్రో రైలు శకటం, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూపొందించిన 'చీపురు కారు' శకటం, గ్రామీణాభివృద్ధి శాఖ శకటం ప్రదర్శనకు వచ్చినపుడు ఆహుతుల్లో భారీ స్పందన కనిపించింది. వృద్ధులు వరుసలో నిలబడి ఆసరా పింఛన్లు తీసుకొంటున్నట్లుగా తయారు చేసిన శకటంలో గ్రామ సచివాలయం పేరు ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామమైన "చింతమడక గ్రామం, సిద్దిపేట మండలం, తెలంగాణ రాష్ట్రం" అని రాసి ఉంది. దీంతో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ స్థానాల్లోంచి లేచి చప్పట్లతో అభినందించారు. సంక్షేమ శాఖ రూపొందించిన కల్యాణ లక్ష్మి శకటంలో నవ వరుడు, వధువుకు పూజారి పెళ్లి చేస్తున్న దృశ్యంలో భాగంగా వధువు మెడలో పెళ్లి కొడుకు తాళి కట్టడంపై సభలో నవ్వులు విరిశాయి. సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో కళాకారులు నృత్యాలు, డప్పులతో సీఎంకు ధన్యవాదాలు తెలపడం ఆకట్టుకొంది. పోలీసు జాగిలాల ప్రదర్శన సందర్భంగా శిక్షకులు సీఎంవద్దకు రాగానే సెల్యూట్ అని ఆదేశించగా, కుక్కలు వంగి శిరస్సు వంచడం అందరిని ఆకర్షించింది. సమాచార ప్రసార శాఖ, నీటి పారుదల, గ్రామీణాభివృద్ధి, అటవీ, వ్యవసాయం, పౌరసరఫరాలు, గిరిజన, మైనారిటీ, బీసీ సంక్షేమం, ఐటీ, పరిశ్రమలు, గృహనిర్మాణం, పర్యాటక, రోడ్లు భవనాలు, మెట్రో, జీహెచ్ఎంసీలకు చెందిన శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి.

**బహుమతులు:** కవాతులో నగరానికి చెందిన సీఏఆర్(సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్) బెటాలియన్ మొదటి స్థానం సాధించింది. కరీంనగర్‌లోని 17వ బెటాలియన్ రెండో స్థానంలో నిలిచింది. మెట్రో రైలు శకటం ఉత్తమ అలంకృత శకటంగా మొదటి బహుమతి పొందింది. తర్వాతి స్థానాల్లో అటవీ, బీసీ సంక్షేమశాఖల శకటాలు నిలిచాయి. బహుమతి సాధించిన శకటాల తరపున మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, అటవీ ముఖ్య, ప్రధాన సంరక్షణాధికారి మిశ్రా, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి రేమండ్ పీటర్‌లు ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా బహుమతులు అందుకొన్నారు.

**ప్రముఖులకు పురస్కారాల అందజేత:** రాష్ట్రవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికైన ప్రముఖులను సీఎం కేసీఆర్ ఘనంగా సత్కరించారు. నగదుతో పాటు, శాలువా, బహుమతిని వారికి బహూకరించారు.